క్లుప్తంగా

కేఎంటీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా రాజశేఖర్



గీసుకొండ : జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ) ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా మాలోతు రాజశేఖర్ ఎన్నికయ్యారు. కేఎంటీపీ కార్మికులు ఆదివారం ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తాటి శివ, కార్యదర్శిగా సందీప్, కోశాధికారిగా మాలోతు చంద్రకళ, సంయుక్త కార్యదర్శిగా చిర్ర అఖిల్, సలహాదార్లుగా డక్క రమ్య, ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడారు. కేఎంటీపీలో కార్మిక చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పోరాడుతుందని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నర్సంపేట రూరల్ : అక్రమంగా నిల్వ చేసిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్టు నర్సంపేట రూరల్ ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలోని పున్నం వీరారెడ్డి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమాచారం అందడంతో స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు. బియ్యంను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించి వీరారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని కొంకపాక నుంచి తీగరాజుపల్లి వెళ్లే దారిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో టైల్స్ పని చేసి ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్తున్న యువకుడు చీకట్లో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ డబ్బాను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం అందించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రోడ్డు పక్కనే ట్రాక్టర్ డబ్బాను నిలపడం, చీకటి నేపథ్యంలో ప్రమాదం జరిగిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఐత సంపత్‌కు అతడి తండ్రి మల్లయ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో చిన్ననాటి మిత్రులు ఆదివారం రూ.11 వేల 500 సాయం అందజేశారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి సంపత్ స్నేహితులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంపత్ స్నేహితులు ఐత మారుతి, ఐత బాబు, సందీప్, ఎర్ర రాజు, పోగులకొండ రవీందర్, గారె కుమార్, గారె అశోక్, రేసు శ్రీధర్, అజారుద్దీన్, ఐత కుమార్, జేరుపోతుల నరేందర్, ఊగ ప్రభాకర్, గారె వెంకటస్వామి, ప్రేమ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) సభ్యుడు కొక్కు నర్సింహస్వామిని అతడి తల్లి సమ్మక్క ఇటీవల మృతి చెందిన క్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించారు. తొలుత సమ్మక్క చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొక్కు సుమన్, రామకృష్ణ, లింగయ్య, మొగిలి, సంతోష్, సారంగం, సాంబయ్య, వెంకటయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

మనోహర్‌కు టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు



హసన్‌పర్తి: 56వ డివిజన్‌లోని ఎస్‌వీఎస్ కాలనీకి చెందిన అనుమాండ్ల మనోహర్.. టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు –24కు ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గణిత సబ్జెక్ట్‌లో మెలకువలు, గణితాన్ని సులువుగా బోధిస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం మనోహర్ సంగెం మండలం మొండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పేరుకే రెన్యువల్.. చేసింది ప్యాచ్ వర్క్

- గుంతలతో తప్పని తిప్పలు

సంగెం : మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ రంగంపేట మీదుగా ముమ్మడివరం వరకు రూ.1.52 కోట్ల వ్యయంతో ఇటీవల చేపట్టిన రోడ్డు రెన్యువల్ వర్క్ పేరుకేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 5 కిలోమీటర్ల మేరకు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉండగా అక్కడక్కడ దెబ్బతిన్న బీటీని తొలగించి కేవలం 2.4 కిలోమీటర్ల మేరకు ప్యాచ్ వర్క్ చేసిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణం సాగించే జనానికి గుంతల తిప్పలు మాత్రం తప్పలేదు. పది చోట్ల ప్యాచ్‌లు వదిలి బీటీ రెన్యువల్ చేశారు. మిగతా గుంతలను ఎప్పుడు పూడ్చుతారంటూ జనం ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి మిగితా చోట్ల కూడా రోడ్డు రెన్యువల్ చేయించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్యాచ్‌లుగా పోసిన తిమ్మాపూర్–ముమ్మడివరం బీటీ రోడ్డు

పూర్తిస్థాయిలో రెన్యువల్ చేయాలి

ఈ దారిలో చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల నుంచే కాకుండా మొండ్రాయి, నల్లబెల్లి, నార్లవాయి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పలు చోట్ల వదిలేయడంతో గుంతలు అలాగే ఉన్నాయి. వెంటనే రోడ్డు మీద ఉన్న అన్ని గుంతలనూ పూడ్చేలా రెన్యువల్ చేయాలి.

-పెండ్లి పురుషోత్తం, మొండ్రాయి

మిగిలిన రోడ్డుకూ బీటీ వేయిస్తాం

రోడ్డు రెన్యూవల్ పనుల కోసం రూ.1.52 కోట్లు మంజూరు చేయగా ఎల్గూర్ రంగంపేట చెరువు మత్తడిలో సీసీ వేయించాము. బాగా దెబ్బతిన్న చోట్ల బీటీ తొలగించి మిగితా వాటితో 2 కిలోమీటర్ల మేరకు రెన్యువల్ పనులు చేపట్టాము. మిగిలిన రోడ్డుకూ బీటీ వేయిస్తాం.

-అభిరామ్, పీఆర్ ఏఈ



బీటీ రోడ్డుపై గుంతలు

సకాలంలో సర్వే పూర్తి చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : సకాలంలో సమగ్ర సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. మండలంలోని గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో ఆదివారం జరిగిన సర్వేను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. ఈనెల 22వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. సర్వే ఫారాల్లో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్యుమరేటర్లు ప్రతిరోజూ 15 ఇళ్లను సర్వే చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనం వేడుకగా నిర్వహించారు. సుమారు 18 ఏళ్ల తర్వాత టెన్త్ క్లాస్ చదువుకున్న స్కూల్‌లో కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులైన మధుసూదన్, అరుణ్‌కుమార్, మాధవి, సారంగపాణి, రవీందర్‌రెడ్డి, యాకయ్య, సమ్మిరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మామునూరి విఘ్నేశ్, సోడ రంజిత్, సంకటి నరేశ్, అనురాధ, బేబి, మమత, సృజన తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నర్సింహనాయక్

ఖానాపురం : సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ భూక్య నర్సింహ నాయక్ తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేదలు అనారోగ్యం బారిన పడి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కమాలుద్దీన్, నాయకులు మారబోయిన రాములు, బొంత శ్రీను, మేకల రాజు, ఎల్లస్వామి, అశోక్, రాజకొమురయ్య, శ్రీను, వెంకన్న, సాయిలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే ధ్యేయం

- 'ఎస్‌ఆర్‌ఆర్' చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : ప్రజలకు సేవలు అందించడమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ నేతగా, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్‌గా ముందుకు సాగుతున్నట్టు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు పరుపాటి రాజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం శాలువాతో సన్మానించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడారు. స్వగ్రామానికి, ప్రజలకు సేవలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మైలారంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. సామాజిక సేవలను తాను బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మైలారం రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు తుమ్మ భూపాల్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బొమ్మినేని రాజిరెడ్డి, చిట్టిరెడ్డి, ఐరెడ్డి వెంకట్‌రెడ్డి, సంధి వంశీధర్‌రెడ్డి, అమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పరుపాటి జనార్ధన్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెరటి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల, మత్స్యకారుల దినోత్సవ వాల్‌పోస్టర్‌ను మత్స్యకారుల సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. ఈనెల 21న గ్రామాల్లో, వార్డుల్లో ముదిరాజ్ జెండాలు ఎగరేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చీరబోయిన రాజు, కార్యదర్శి నూనె యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆళ్ల చిన్న కొమురయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చొప్పరి చిన్న నర్సయ్య, నాయకులు నూనె అశోక్, చొప్పరి యాదయ్య, నూనె సోమయ్య, నూనె ప్రభాకర్, మహాంకాళి సారయ్య, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి



రాయపర్తి : ఈనెల 19న వరంగల్‌లో నిర్వహించనున్న ఇందిరా మహిళా శక్తి సీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల నుంచి ప్రజలు, శ్రేణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, భూక్య సమ్మయ్య, చిర్ర మల్లయ్య, భగవాన్, కందికట్ల యాకయ్య, మాధవరావు, ఓరుగంటి వెంకన్న, నర్సింహారావు, యాకూబ్, గౌస్‌ఖాన్, కందికట్ల కొమురయ్య, బొమ్మెర కల్యాణ్, పీరని ప్రవీణ్, కందుకూరి కృష్ణ, చిర్ర నాగరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనే లక్ష్యంగా ధర్మయుద్ధం



ప్రతిజ్ఞ చేస్తున్న మండల కార్యవర్గం

గీసుకొండ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించడమే లక్ష్యంగా ధర్మయుద్ధం చేసే దిశగా వచ్చే నెల 21న హైదరాబాద్‌లో మహాసభ నిర్వహించనున్నట్టు ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశానికి మహేందర్, రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. మహాసభకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కెల్లి నాగరాజు, అధికార ప్రతినిధిగా దౌడు దామోదర్, ఉపాధ్యక్షుడుగా గడ్డం బాలకృష్ణ, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా డక్క శ్యామ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు.

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి

పర్వతగిరి : మండలంలోని పెద్ద చెరువు రిజర్వాయర్ ముంపు బాధిత రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బాధిత రైతులు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును ఆదివారం కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా అనిల్‌రావు మాట్లాడారు. రిజర్వాయర్ నీటి ముంపుతో మూడేళ్లుగా పంట పొలాలు నీట మునుగుతూ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు బాధిత రైతులకు నష్టపోయిన ఐదు పంటల పరిహారం ఇప్పించడంతోపాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, ముంపు బాధిత రైతులు బొట్ల వీరస్వామి, సింగారపు రమేశ్, బొట్ల కనకరాజు, సుమన్, పూలమ్మ, శ్రావణ్, అనిల్, యాకయ్య, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన అనంతరమే వర్గీకరణ చేయాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన అనంతరమే ఎస్సీ వర్గీకరణ చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన తర్వాత చేస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. కులగణన చేపడితే మాల, మాదిగల ఉపకుల జనాభా శాతం తెలుస్తుందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ తొందరగా చేయాలని, అప్పటివరకు పోస్టుల భర్తీని ఆపాలని ఆందోళనలు చేపట్టడం సరికాదన్నారు. సమావేశంలో కంజర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అర్వయ్యపల్లి.. వానర విడిది!

వానర సైన్యం హల్‌చల్ చేసింది. కోతులు విద్యార్థుల మాదిరిగా చదువుతున్నట్లు సందడి చేశాయి. దీంతో పలువురు ఆసక్తిగా తిలకించి సెల్‌ఫోన్లలో బంధించారు. నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం రాత్రి కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- నర్సంపేట

మండల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

నెక్కొండ : మండల సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కార్యాచరణ చేపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో పలు అభివద్ధి పనుల మంజూరీకి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలో పనులు జరుగుతాయని తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాల్టీగా ఉన్నతీకరించేందుకు చొరవ తీసుకుంటున్నారని, త్వరలో జీఓ విడుదల కానుందని చెప్పారు. రైల్వేస్టేషన్ నుంచి వట్టివాగు వరకు నాలుగు లైన్ల బీటీ రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతామన్నారు. నెక్కొండ చెరువు కట్ట నుంచి పత్తిపాక మీదుగా సాయిరెడ్డిపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డు, చంద్రగొండ క్రాస్ నుంచి బంజరుపల్లి మీదుగా సంగెం మండలం ఎల్గూరు వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు మంజురయ్యాయని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో మండలం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గతంలో నాటి మంత్రి హరీశ్‌రావు మండలాన్ని దత్తత తీసుకుని ఏపాటి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు స్థాయి మరిచి ఎమ్మెల్యే మాధవరెడ్డిని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మహిళ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామారపు శిరీశ, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, అన్వర్ పాషా, బక్కి నరేశ్, తంశెట్టి సాంబయ్య, శ్రీకాంత్, అశోక్, రమేశ్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

చెన్నారావుపేట : ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలో మొగులోజు శారద, పరికి మధుకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ చెన్నారావుపేట, నెక్కొండ, పర్వతగిరి మండల ఏరియా మహాసభకు రంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ ఆస్తుల విక్రయానికి యత్నిస్తోందని విమర్శించారు. దేశంలో విద్య, వైద్యం ఉపాధి మీద దృష్టి పెట్టకుండా ప్రజలపై భారం మోపుతూ నిత్యావసర సరుకుల ధరలు పెంచుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార దిశగా ప్రజాపోరాటాలు నిర్మించాలని సూచించారు. సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, మండల కార్యదర్శి నమిండ్ల స్వామి, నాయకులు బిల్లా భూపాల్‌రెడ్డి, నరేశ్, ఐలయ్య, జన్ను రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతనాలు పెంచాలి



నినాదాలు చేస్తున్న మల్లేశం, రైస్ మిల్ కార్మికులు

ఖానాపురం : పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెంచాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శ్రీనివాస రైస్‌మిల్ వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో అసంఘటిత రంగంలో కొట్లాది మంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేవని తెలిపారు. సమగ్ర చట్టాలు తీసుకొచ్చి కనీస వేతనాలు అమలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక చట్టాలను సవరించడం వల్ల కార్మికులకు భారీగా నష్టం వాటిల్లుతోందని చెప్పారు. యాభై ఏళ్లకు పైబడిన కార్మికులకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మల్లేశం, రైస్ మిల్ కార్మికులు నినాదాలు చేశారు. సమావేశంలో నాయకులు చిన్నపెల్లి పోశాలు, పుల్లన్న, వెంకటేశ్వర్లు, కొమురయ్య, రాజు, శ్రీను, యాకూబ్, రమేశ్, యాకయ్య, భూలక్ష్మి, రాణి, మంగమ్మ, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రేట్ల జీఓ విడుదల చేయండి

నర్సంపేట : ప్రభుత్వం సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పెంచిన రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సివిల్ సప్లై గోదాం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీ కార్మికులు ప్రభుత్వంతో రెండేళ్లకోసారి రేట్ల ఒప్పందం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఒప్పందం ముగిసి 9 నెలలు గడచినా కొత్తగా రేట్ల ఒప్పందం చేయకుండా కార్మికులను ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోందని విమర్శించారు. జేఏసీ ఆధ్వర్యంలో కమిషనర్ సమక్షంలో 2024 అక్టోబర్ 3న చేసిన ఒప్పందానికి సంబంధించి ఇప్పటివరకు జీఓ విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.